క్లుప్తంగా

కొనసాగుతున్న గంగానమ్మ జాతర

పామర్రు: గంగానమ్మతల్లి జాతర మహోత్సవం గురువారం నాలుగవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అమ్మవారిని ఆలయం నుంచి మేళ తాళాలతో డప్పు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అమ్మవారి ఘటం కుండకు ప్రత్యేక పూజలు చేసి చద్ది నివేదనలను సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. పోతురాజు గడకు నూతన వస్త్రాలను సమర్పించి పసుపుతో ఓలలాడించుకుని పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

దంత వైద్యులకు సత్కారం



గుడివాడ టౌన్: జాతీయ దంత వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ సభ్యులు పట్టణంలోని దంత వైద్యులను సత్కరించారు. స్థానిక ఏలూరు రోడ్‌లోని సాయి దంత వైద్యశాల వైద్యుడు డాక్టర్ లింగం నాగేంద్రనాథ్, రవి దంత వైద్యశాల వైద్యుడు డాక్టర్ మలిరెడ్డి రవి తదితరులను సత్కరించారు. వైద్యులు చేస్తున్న సేవలను గుర్తించి ఈ చిరు సత్కారం చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు కోనా రామారావు తెలిపారు. క్లబ్ కార్యదర్శి డీ శ్రీనివాసరావు, జేసీ లాలాజపతి రాయ్, వాకర్స్ జిల్లా గవర్నర్ ఎల్‌ఈ వెంకటేశ్వరరావు, వీ బ్రహ్మాజీ పాల్గొన్నారు.

యాదవులకు ప్రాధాన్యం ఇవ్వాలి



పామర్రు: రానున్న శాసనమండలి ఎన్నికల్లో యాదవ సామాజిక వర్గానికి సముచిత స్థానం కల్పించాలని పామర్రు నియోజకవర్గ యాదవ సంఘ అధ్యక్షుడు గొరిపర్తి నాగబాబు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఆర్అండ్‌బీ గెస్టుహౌస్‌లో గురువారం నియోజకవర్గ యాదవ సామాజిక వర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెలాఖరుకు ఐదుగురు ఎమ్మెల్సీలు పదవీ విరమణ చేస్తుండగా వీరిలో ముగ్గురు యాదవ సామాజిక వర్గానికి చెందిన వారే ఉన్నారని తెలిపారు. ఈ మూడు స్థానాలు తిరిగి యాదవ సామాజిక వర్గానికే కేటాయించాలని, అందులో ఒకటి కృష్ణాజిల్లాకు తప్పనిసరిగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు కొలుసు సుధాకర్, మూడే శివశంకర్, జొన్నలగడ్డ సురేష్, రామారావు, వెంకట్, మదిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

సాయినాథునికి ప్రత్యేక పూజలు



పామర్రు: ఫాల్గుణ మాసం తొలి గురువారం పురస్కరించుకుని స్థానిక సాయినగర్‌లోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తొలుత కాగడా హారతిలో ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం పంచామృతాలు, నవరసాలు, సుగంధ ద్రవ్యాలతో సాయిబాబాకు అభిషేకాలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను వితరణ చేశారు. అనంతరం అన్నప్రసాదాన్ని నిర్వహించారు. ఆలయ ధర్మకర్త తమ్మా వినోద్ రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మండవల్లి: మండలంలో కైకలూరు – ఏలూరు రహదారి కాకతీయనగర్ వద్ద రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు వైపు నుంచి కొబ్బరి బోండాల లోడుతో కైకలూరు వైపునకు వస్తున్న ఆటో కాకతీయనగర్ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడిపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలు అవడంతో 108 వాహనంలో ఏలూరు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మండవల్లి పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

చురుగ్గా మినుము నూర్పిళ్లు



పామర్రు: మండల పరిధిలో మినుము నూర్పిళ్ల పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మండలంలో 23,500 ఎకరాల్లో మినుము సాగు చేపట్టారు. వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఇప్పటి వరకు సుమారు 13 వేల ఎకరాల్లో నూర్పిళ్లు మిషన్ల సాయంతో పూర్తి చేశారు. అందరూ ఒక్కసారే పంట నూర్పిళ్ల పనులు ప్రారంభించడంతో కొంతమేర కూలీల సమస్య రైతులను వేధిస్తోంది. దీంతో రైతులు కొంత అవస్థలు ఎదుర్కొంటున్నారు. మినుము పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని అంటున్నారు

మహిళల రక్షణే ధ్యేయంగా..

- చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న పోలీసులు
- రేపు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

హెల్ప్ లైన్ల నంబర్లు	
చైల్డ్	1098
ఉమెన్	181
పోలీస్	100/112
సైబర్ క్రైం	1930



విద్యార్థినులకు ఓపెన్ హౌస్ నిర్వహిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

గుడ్లవల్లేరు: సమాజంలో మహిళలు, విద్యార్థినులపై వేధింపులు నానాటికీ పెరిగిపోతున్నాయి. ఈ పరిణామాలు అందరిలోనూ ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వారికి రక్షణ కవచంలా నిలిచేందుకు పోలీసులు కదిలారు. ఈనెల 8వ తేదీ శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందుగానే పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు మహిళల రక్షణ, భద్రతకు సంబంధించిన చట్టాలపై పోలీస్ స్టేషన్ల వారీగా అవగాహన కల్పిస్తున్నారు. గత మూడు రోజులుగా గుడివాడ నియోజకవర్గంలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఓపెన్ హౌస్, మహిళా చట్టాలపై అవగాహన ర్యాలీలు, మెడికల్ క్యాంప్‌లు చేస్తున్నారు. ఈ తరహా కార్యక్రమాలను రేపటి వరకు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. మహిళలకు సంబంధించిన అంశాలు, చట్టాలపై అవగాహన కల్పించడానికి పోలీసు అధికారులు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చివరి రోజు 8వ తేదీ మహిళలతో ప్రదర్శనలు నిర్వహించేలా కార్యక్రమాలకు రూపకల్పన చేశారు.

స్వీయ రక్షణ పద్ధతులపై అవగాహన

పోలీసుల విధుల నిర్వహణలో ఉపయోగించే పరికరాలపై విద్యార్థినులకు ఓపెన్ హౌస్ నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థినుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. మహిళలు, యువతులు, చిన్నారుల రక్షణకు రూపొందించి అమలు చేస్తున్న చట్టాలను వివరిస్తున్నారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఫోక్సో చట్టాలతో పాటు సామాజిక మాధ్యమాల వినియోగం – దుష్పరిణామాలు, సైబర్ నేరాలు – తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలను వివరిస్తున్నారు. బాలికలు స్వీయ రక్షణ పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని సూచిస్తున్నారు. మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలపై అవగాహన కార్యక్రమాలతో పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సందర్శించండి.. తెలుసుకోండి అంటూ మహిళలు, యువతులు, విద్యార్థినులను పోలీస్ స్టేషన్లకు ఆహ్వానిస్తున్నారు. పోలీసు విధులు, మహిళా సహాయక కేంద్రం పనితీరు, అధికారుల పనితీరుపై అవగాహన కల్పిస్తున్నారు.



విద్యార్థినులకు అవగాహన కలిగిస్తున్న రక్షణ టీముకు చెందిన మహిళా పోలీసులు

అన్ని వేళలా అందుబాటులో ఉంటాం

మహిళలు, విద్యార్థినులు, చిన్నారులు ఎక్కడైనా ఎప్పుడైనా ఏదైనా ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటే తక్షణ సహాయం కోసం పోలీసులతో పాటు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు హెల్ప్ లైన్ నంబర్లను సంప్రదించండి. సత్వరమే మహిళా రక్షణ కొరకు పోలీసులు అన్ని వేళలా అందుబాటులో ఉంటారు.

– ఎన్‌వీవీ సత్యనారాయణ, ఎస్ఐ, గుడ్లవల్లేరు

ఫార్మసీ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు



అవార్డులు, ధ్రువ పత్రాలు అందుకున్న విజేతలతో అతిథులు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో గురువారం అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెషనల్స్ వారి అనుసంధానంగా అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఏపీపీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ రాజీవ్ దహియా, గౌరవ అతిథిగా ఏపీపీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సీవీ సురేష్ విచ్చేశారు. ముందుగా కార్యక్రమాన్ని పీ తన్మయి స్వాగతం నృత్యం, కే మైత్రి ప్రార్థనా గీతంతో ఆరంభించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ సదస్సు ఔషధ శాస్త్రాల్లో ఔషధ రూప కల్పన భవిష్యత్తు అవకాశాలు అనే అంశంపై నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యఅతిథి రాజీవ్ దహియా మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సంక్రమించే కొత్త వ్యాధులకు గణనీయమైన వైద్య అవసరాలు ఉన్నాయన్నారు. ఔషధ రూపకల్పనలో ఆధునిక టెక్నాలజీని వినియోగించి ప్రభావవంతమైన ఔషధాలను రూపొందించాలని కోరారు. గౌరవ అతిథి సురేష్ మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులు నిబద్ధత, క్రమశిక్షణతో కూడిన కృషిని అలవర్చుకొని విజయ పంథాన నడవాలని కోరారు. అతిథుల చేతుల మీదుగా అబ్‌స్ట్రాక్స్ రూపొందించిన సోవినీర్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెషనల్ అధ్యాపకులు విద్యార్థులకు, ఉత్తమ అధ్యాపకుడు, ఉత్తమ విద్యార్థి, ఉత్తమ పరిశోధకులు అవార్డులు, ధ్రువ పత్రాలను అందించారు. వివిధ కళాశాల నుంచి విచ్చేసిన విద్యార్థులు, పరిశోధకులు ఈ–పోస్టర్ మరియు ఓరల్ ప్రజెంటేషన్ ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రంతో పాటు మెమెంటో బహూకరించారు. అనంతరం సదస్సుకు విచ్చేసిన అతిథులను సత్కరించారు. సదస్సులో నలంద ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కేఎస్‌వీ రావు, కో–ఆర్డినేటర్ డాక్టర్ పీ రవిష, అధ్యాపకులు డాక్టర్ టీ ప్రశాంతి, డాక్టర్ టీ బాలకృష్ణ, బీ సత్యశ్రీ, టీ శ్రావణి, వీఎల్ వినోద్‌కుమార్, డాక్టర్ ఏ సాయిధాత్రి, డాక్టర్ వీ రజిని తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడిలో డస్ట్‌బిన్ల పంపిణీ

కూచిపూడి(మొవ్వ): చెత్త సేకరణకు వీలుగా కూచిపూడి గ్రామ పంచాయతీలో గురువారం 7, 8, 10వ వార్డుల్లో ఇంటింటికీ ప్లాస్టిక్ డస్ట్‌బిన్‌లను సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా సేకరించి చెత్తని పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కే పుష్పనాదం, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ బీ ఉమామహేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ ఏ రామ్‌ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

చదువుల తల్లి సరస్వతికి నీరాజనాలు



కూచిపూడి(మొవ్వ): ఈ నెల 17వ తేదీ నుంచి జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలంటూ ప్రధానోపాధ్యాయులు గుంటూరు వెంకట సత్యప్రసాద్ పర్యవేక్షణలో కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఓరియెంటల్ హైస్కూల్లో విద్యార్థులు గురువారం సరస్వతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా చదువుల తల్లికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి నీరాజనాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ హౌస్‌పై విద్యార్థులకు అవగాహన

పామర్రు: పోలీసుల విధులు నిర్వహించే రికార్డుల గురించి విద్యార్థులకు అవగాహన కలిగించామని పామర్రు ఎస్ఐ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్ హౌస్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సంరక్షణ వ్యవస్థ గురించి కూడా తెలుసుకోవడం మంచిదని అన్నారు. పోలీసుల విధులు, అత్యవసర సమయాల్లో ఏవిధంగా స్పందిస్తారు.. ప్రజలకు ఏవిధంగా సంరక్షణ కల్పిస్తుంటారు అనే అంశాలను వివరించారు. అవసరమైన సమయాల్లో ఆయుధాలను ఏవిధంగా వినియోగిస్తారో చెప్పారు. ఎఫ్ఐఆర్ రికార్డుల నమోదు, సేకరించిన ఫిర్యాదులను ఏవిధంగా పరిష్కరిస్తారనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్నియాల సేకరణ

గుడివాడ టౌన్: మానవతా స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో గురువారం కార్నియాలు సేకరించారు. సేవా సంస్థ సభ్యుడు సీహెచ్ శ్రీనివాసరావు తల్లి సంపూర్ణ దేవి మృతి అనంతరం కార్నియాలు సేకరించి విజయవాడలోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి పంపినట్లు స్వచ్ఛంధ సంస్థ వైస్ ప్రెసిడెంట్ దండమూడి సీతారామస్వామి తెలిపారు. ప్రతి ఒక్కరూ నేత్రాలు దానం చెయ్యడం అలవర్చుకోవాలని ఆయన కోరారు.

అభివృద్ధి పనుల పరిశీలన



ముదినేపల్లి రూరల్: స్థానిక మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల ఆవరణలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ గురువారం పరిశీలించారు. ఈ రెండు కార్యాలయాల ఆవరణల చుట్టూ ప్రహరీలు నిర్మిస్తున్నారు. వీటిని ఎంపీపీతో పాటు తహసీల్దార్ సుభాని, ఎంపీడీవో రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కార్యాలయాలు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా తీర్చిదిద్దడంతో పాటు పలు రకాల సౌకర్యాలకు సంబంధించి అభివృద్ధి పనులను చేపట్టామని తెలిపారు.

ఘనంగా ప్రతిష్ఠా మహోత్సవం

గుడ్లవల్లేరు: పెసరమిల్లిలో శ్రీరాజరాజేశ్వరీ ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. అమ్మవారి ఆలయంతో పాటు సాయిబాబా మందిర ప్రతిష్ఠను కూడా వేద మంత్రోచ్చరణ నడుమ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని భక్తులు తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సామాజిక తనిఖీలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు క్లస్టర్ పాఠశాలల్లో సామాజిక తనిఖీలు గురువారం ప్రారంభమయ్యాయి. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను ఐదు క్లస్టర్లుగా విభజించారు. వీటిలో తొలుత పెదపాలపర్రు, ముదినేపల్లి క్లస్టర్ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించారు. పాఠశాలల యాజమాన్య కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రభుత్వ నిధులతో చేసిన అభివృద్ధి పనులను పరిశీలిస్తున్నారు. ఈ క్లస్టర్లలో తనిఖీలు పూర్తి చేసి నివేదికలు రూపొందిస్తున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో డ్రోన్‌లు కీలకం

కైకలూరు: శాంతి భద్రతల పరిరక్షణలో డ్రోన్ పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్నామని పట్టణ సీఐ పీ కృష్ణ తెలిపారు. ఆటపాక, రాచపట్నం, గోపవరం డ్రోన్ వ్యవస్థ ద్వారా ప్రయోగాత్మకంగా గ్రామ చిత్రాలను తీశారు. బహిరంగ ప్రదేశాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, అసాంఘిక కార్యకలాపాలను గుర్తించి, ప్రజలకు భద్రత కల్పించేందుకు డ్రోన్ వ్యవస్థ ఉపయోగపడుతుందని సీఐ తెలిపారు. స్థానిక ప్రజలకు డ్రోన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టౌన్ ఎస్ఐలు డీ వెంకట్‌కుమార్, ఆర్ శ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వరాలివ్వమ్మా.. పెద్దింట్లమ్మ



కైకలూరు: అమ్మా.. పెద్దింట్లమ్మా.. నిన్ను కొలిచే మాకు వరాలివ్వమ్మా.. అంటూ భక్తులు ఆర్తితో వేడుకున్నారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతర గురువారానికి ఆరో రోజుకు చేరింది. అమ్మవారికి కలశార్చన, ధూపసేవ, బాలభోగం, ప్రత్యేక పూజలను ఆలయ ప్రధాన అర్చకులు పేటేటి పరమేశ్వర శర్మ నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని వేడి నైవేద్యాలను సమర్పించారు. పెద్దింట్లమ్మకు వస్త్ర, పుష్పాలంకరణ, ఉచిత ప్రసాద దాతలుగా ఆటపాక గ్రామానికి చెందిన భూపతిరాజు వెంకటేశ్వరవర్మ, శ్రీరామవర్మ దంపతులు వ్యవహరించారు. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన ఉపేంద్ర భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆకట్టుకుంది. ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాసు మాట్లాడుతూ జాతరలో ప్రధాన ఘట్టమైన జలదుర్గాగోకర్ణేశ్వరస్వామి కల్యాణం ఈ నెల 10న నిర్వహిస్తామని తెలిపారు.

అన్నసమారాధన

మండవల్లి: శ్రీదత్త పరంపర సహిత షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు గుడివాడ వెంకట వరప్రసాద్, తులసిరత్నం దంపతుల ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం బాబావారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బండారు వెంకయ్య, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

తపాలా జీవిత బీమాతో భరోసా



కైకలూరు: తపాలా జీవిత బీమాతో భరోసా అందుతుందని గుడివాడ పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ ముత్యాల శ్రీనివాస్ తెలిపారు. కైకలూరు తపాలాశాఖ కార్యాలయంలో జీవిత బీమా విజయోత్సవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. స్థానిక సిబ్బంది మాట్లాడుతూ ఫిబ్రవరి 19, 20వ తేదీల్లో జరిగిన పీఎల్‌జే, ఆర్‌పీఎల్‌జే స్కీంల నుంచి రూ.35 లక్షల విలువైన ప్రీమియాన్ని 400 కుటుంబాలకు బీమా చేయించామని తెలిపారు. ముత్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ తపాలాశాఖ 141 ఏళ్లుగా సేవలు అందిస్తోందన్నారు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్ అందిస్తుందని చెప్పారు. ఈ నెల 14, 15వ తేదీల్లో జరిగే తపాలా జీవిత బీమా మేళాను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం బీమా స్మార్ట్ పోటీల్లో విజేతలను అభినందించారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ అధికారి కందగిరి సురేష్‌కుమార్, సబ్ పోస్ట్ ఆఫీసర్ కేఎస్‌కే రెడ్డి, పచ్చిగోళ్ల దుర్గాప్రసాద్, గోళ్ల మోహనవర్మ పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఐఈఆర్పీల నిరసన



మండవల్లి భవిత సెంటర్‌లో నిరసన తెలియజేస్తున్న ఐఈఆర్పీలు

మండవల్లి: మండవల్లి సమగ్ర శిక్ష అభియాన్‌లో పని చేస్తున్న ఐఈఆర్పీలు తమ హక్కుల సాధనకు గురువారం నిరసన తెలిపారు. హెచ్ఆర్ పాలసీ అమలు, మినిమం టైం స్కేల్, ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు, ఉద్యోగ భద్రత, పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచడం, పింఛన్ సదుపాయం, ప్రభుత్వ ఉద్యోగాల్లో వెయిటేజీ, కారుణ్య నియామకాల అమలు వంటి డిమాండ్లు అమలు చేయాలని కోరారు. డిమాండ్ల సాధనకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి చర్యలు లేకపోవడంతో ఎంఈఓ కార్యాలయం వద్ద కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ నిరసన తెలియజేశారు. మండల కంప్యూటర్ ఆపరేటర్ ఎం.వెంకటరత్నం, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ బీ దుర్గ భవాని, అకౌంటెంట్ భగవాన్ పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన గుడ్లవల్లేరు విద్యార్థులు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రాజశేఖర్ తదితరులు

గుడ్లవల్లేరు: జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీ అనుబంధ సంస్థగా జీఈ ఏరోస్పేస్ వారు గత ఫిబ్రవరి 28వ తేదీన నిర్వహించిన ఆన్‌లైన్ ప్రాంగణ ఎంపికల్లో తమ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ ఏఏఎన్ఎమ్ అండ్ వీవీఆర్ఎస్ఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్ గురువారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు కొలువులు సాధించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థులతో పాటు ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ ఆఫీసర్, ఎలక్ట్రికల్ విభాగాధిపతి శ్రీ ఎమ్ వినయ్, మెకానికల్ విభాగాధిపతి ఎస్ సురేష్‌ను కళాశాల చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ వల్లూరుపల్లి సత్యనారాయణ రావు, కోసెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ వల్లూరుపల్లి రామకృష్ణ, మెంటార్ రామాంజనేయులు, ప్రిన్సిపాల్ రాజశేఖర్ అభినందించారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



మినుము రైతులతో నారాయణరావు

మొవ్వ: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి ఏపీ కౌలు రైతుల సంఘం కృష్ణా జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన మండలంలోని ఔరుపుడి గ్రామంలో స్థానిక రైతులతో కలిసి మినుము పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కృష్ణాజిల్లాలో మినుము పంట మాసూలు చేయడం జరుగుతోందన్నారు. నేడు రాష్ట్రంలో మినుము పంటకు గిట్టుబాటు ధర లేక రైతాంగం అప్పులపాలు కావలసిన పరిస్థితి నెలకొందని అన్నారు. గత సీజన్‌లో మినుము ధర 100 కేజీలు సుమారు రూ. 9 వేలకు పైగా ఉండేదని, ప్రస్తుతం రూ. 7,500 నుంచి రూ.7,900 వరకు ధర నడుస్తోందన్నారు. గత సీజన్ కన్నా ఈ సీజన్‌కు మినుము ధర తగ్గడంతో రైతాంగం ఆందోళన చెందుతోందన్నారు. పెరిగిన పురుగు మందుల ధరలతో ఇప్పటికే రైతులు ఎకరానికి సుమారు రూ. 30 వేలు పెట్టుబడి పెట్టారని తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఉండేలా యుద్ధ ప్రాతిపాదికన చర్యలు చేపట్టాలని కోరారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించి మినుము పంటను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించండి



నిరసన తెలుపుతున్న ఆశ వర్కర్లతో ఆర్‌సీపీ రెడ్డి

గుడివాడ టౌన్: ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆశావర్కర్లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆశా వర్కర్లకు గత ప్రభుత్వంలో ఇచ్చిన రూ. 10 వేలు మినహా ఇప్పటి వరకు ఏ విధమైన మార్పు జరగలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాకు పిలుపునిస్తే వారిపై ఆంక్షలు విధించడం, నిర్బంధించడం దుర్మార్గమన్నారు. మహిళలు అని కూడా చూడకుండా ఇళ్లకు పోలీసులను పంపి నిర్బంధించడం ప్రజాస్వామ్యంలో సరైన విధానం కాదన్నారు. కూటమి ప్రభుత్వం తన పంథాను మార్చుకోవాలని లేని పక్షంలో ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వేసవిలో మెరుగైన విద్యుత్ సేవలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ సత్యానందం

గుడివాడ టౌన్: రానున్న వేసవి కాలంలో విద్యుత్ వినియోగదారులకు అసౌకర్యం కలుగకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ మచిలీపట్నం సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం. సత్యానందం పేర్కొన్నారు. స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో గురువారం విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైతే లో ఓల్టేజ్ గుర్తిస్తారో అక్కడ అదనపు ట్రాన్స్‌ఫారమ్‌కు చర్యలు చేపట్టాలని సూచించారు. ట్రాన్స్‌ఫారమ్‌లు అవసరమైతే వెంటనే సరఫరా చేస్తామన్నారు. గుడివాడ పట్టణానికి సంబంధించి 160 కేవీలు మంజూరు చేశామని తెలిపారు. అదనంగా ఎలాంటి అవసరాలు ఉన్నా సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గుడివాడ ఈఈ జీబీ శ్రీనివాసరావు, డెప్యూటీ ఈఈలు, ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్‌లు, లైన్‌మెన్‌లు, అక్కౌంట్స్ ఆఫీసర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

కలుషిత నీటితో చేపలు మృతి



నందివాడ: మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో పంకాజ్ చెరువులోని కలుషిత నీరు దోసపాడు ఛానెల్ పంట కాలువలో కలవడంతో అందులోని చేపలు మృతిచెందాయి. ఆ విషయాన్ని గ్రహించిన రైతులు, గ్రామస్తులు ఆందోళన చెందడంతో దీనిపై ఇరిగేషన్ శాఖ డీఈ, ఫిషరీష్ శాఖ వారు స్పందించి సాగు రైతులకు, మంచినీటి చెరువులకు ఉపయోగించు గ్రామాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా మృత్యువాత పడ్డ చేపలను జేసీబీ సాయంతో ట్రాక్టర్ ద్వారా తరలించి నిర్మానుష ప్రాంతంలో పూడ్చిపెట్టామని తెలిపారు. కలుషితమైన నీటిని కూడా డ్రెయినేజీలోకి తరలించే చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ డీఈ తెలిపారు.

సవరణ

నా సైయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, మచిలీపట్నం (బ్రాంచ్‌వారు) ది. 19-2-2025న ఇచ్చిన ప్రకటనలో ముడునూరి మధువర్మ గారికి ఋణం ఇవ్వబడు నిర్ణయించుకున్నాము అని చదువుకొనవలెను.